# కాంగ్రెస్ లో అంతర్గత పోరు..



మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్ రావు

- హామీలను అమలు చేసే దమ్ము రేవంత్ రెడ్డికి లేదు..
- ప్రజలు తప్పు చేశామని బాధపడుతున్నారు..
- కేసీఆర్ తోనే తెలంగాణ అభివృద్ధి
- కార్యకర్తల సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**అక్షర దర్బార్, జనగామ, ఫిబ్రవరి 7 :** కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు మొదలైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఉషోదయ గార్డెన్ లో ఏర్పాటు చేసిన జనగామ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా మాజీ మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా పార్టీని కాపాడుకోవడం ముఖ్యమని అన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలు దేశంలో ఎవరూ ప్రవేశపెట్టలేదని, దేవాదుల ప్రాజెక్టు పూర్తిచేసి నియోజకవర్గంలో సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు. దేశంలో రైతు బంధు, రైతు బీమా, 24 గంటలు కరెంట్ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత వచ్చిందని, ఆ పార్టీకి ఓటు ఎందుకు వేశామా అని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అమలు చేసే దమ్ము ఉందా అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'మార్కండేయ' శోభాయాత్రకు
# మంత్రి సురేఖకు ఆహ్వానం

**అక్షర దర్బార్, సిరిసిల్ల, ఫిబ్రవరి 7 :** భక్త మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న సిరిసిల్లలో నిర్వహించనున్న శ్రీ శివభక్త మార్కండేయ స్వామి శోభాయాత్రలో పాల్గొనాలని కోరుతూ బుధవారం సిరిసిల్ల పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జె తార, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ఉపాధ్యక్షులు, మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు కాముని వనిత తదితరులు ఉన్నారు.



మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న పద్మశాలీ నాయకులు

## పారిశుద్ధ్య కార్యక్రమాలను
# పకడ్బందీగా నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

**అక్షర దర్బార్, జనగామ, ఫిబ్రవరి 7 :** పారిశుద్ధ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జనగామ జిల్లా కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అధికారులను ఆదేశించారు. లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య వారోత్సవాల గ్రామసభను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహిస్తోందని అన్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం, ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ ద్వారా పనులు చేస్తున్న సిబ్బందికి నగదు చెల్లింపులకు కేవైసీ అప్ డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి కే.ఆర్ లత, కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

## అక్రమ నిర్మాణాలు
# తొలగింపు..

**అక్షర దర్బార్, హన్మకొండ, ఫిబ్రవరి 7 :** జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని 2వ డివిజన్ గుండ్ల సింగారం ప్రాంతంలో అనధికారికంగా నిర్మించిన మొదటి, రెండో అంతస్తు భవన కట్టడాలను బల్దియా పట్టణ ప్రణాళిక అధికారులు బుధవారం కూల్చివేశారు. అనుమతి లేకుండా కట్టడాలు, స్థలాలను అక్రమించుకుని నిర్మాణాలు చేస్తే వాటిని కూల్చడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని సిటీ ప్లానర్ వెంకన్న హెచ్చరించారు. బల్దియా ఏసీపి ఖలిల్ ఆధ్వర్యంలో జరిగిన కూల్చివేతల్లో పట్టణ ప్రణాళిక, పోలీసు అధికారులు,. డీఆర్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాన్ని కూలగొడుతున్న సిబ్బంది

## బల్దియాలో రెవెన్యూ
# సమస్యల మేళా

**అక్షర దర్బార్, వరంగల్, ఫిబ్రవరి 7 :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సమస్యల పరిష్కార మేళా నిర్వహించినట్లు అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. మేళాలో నగర ప్రజల నుంచి 25 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. నూతన ఇంటి పన్ను, ఇంటి పన్ను సవరణ, ఇంటి యజమాని పేరు సవరణ, ఇంటి నెంబర్ సవరణ, ఖాళీ స్థలానికి పన్ను విధింపు, ఖాళీ స్థలం పన్ను నుంచి ఇంటి పన్నుకు మార్పు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. సత్వరమే ప్రజల వినతులకు పరిష్కార మార్గాలు చూపుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనిల్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ వో డాక్టర్ అంబరీష్

## మార్చి3న
# పల్స్ పోలియో..
### డీఎంహెచ్ వో డాక్టర్ అంబరీష్

**అక్షర దర్బార్, మహబూబాబాద్, ఫిబ్రవరి 7 :** మార్చి 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్వో డాక్టర్ అంబరీష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం చుక్కల కార్యక్రమంపై మహబూబాబాద్ లోని ఐఎంఏ హాల్లో వైద్యాధికారులకు, హెల్త్ సూపర్ వైజర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో డాక్టర్ అంబరీష్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 5ఏళ్లలోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ విజయకుమార్, డిస్ట్రిక్ట్ సర్వే లైన్స్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డేబోయిన శ్రీనివాస్, కేవీ రాజు, రామకృష్ణ, అరుణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఉమాకర్ సిబ్బంది పాల్గొన్నారు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

## నయీంనగర్ నాలా
# పనులు ప్రారంభం

**అక్షర దర్బార్, హన్మకొండ, ఫిబ్రవరి 7 :** అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారం హన్మకొండ నయీంనగర్ నాలా, బ్రిడ్జ్ పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.15 కోట్ల వ్యయంతో నయీంనగర్ నాలా, బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నాళాలు ఆక్రమణకు గురవడంతో వర్షాకాలంలో వరద బీభత్సంతో రెండుసార్లు హన్మకొండ నగరం నీట మునిగిందని, మళ్లీ పునరావృతం కాకుండా నాలాపై పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నగర అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు, మున్సిపల్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం
# పట్టివేత..
### 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్..

**అక్షర దర్బార్, దుగ్గొండి, ఫిబ్రవరి 7 :** అక్రమంగా నిల్వ చేసిన 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా దుగ్గొండి మండల శివారులో అక్రమంగా పీడీఎస్ బియ్యం డంపింగ్ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి 24 క్వింటాళ్ల బియ్యం పట్టుకుని, పర్వతం అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.